సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 24 । మే । 2025



చీనీ టన్ను రూ.38,120

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.38,120, కనిష్టంగా రూ.5,100 ప్రకారం ధర పలికాయి.



జిల్లాకు వర్ష సూచన

రాగల ఐదు రోజులూ జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ నెల 24 నుంచి 28 వరకు తేలికపాటి వర్షాలు కురుస్తాయన్నారు.

గరిష్టం/కనిష్టం
34.7°/22.3°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఉక్కపోత కూడా తగ్గింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

మడకశిరలో ఎలుగుబంటి హల్‌చల్



ప్రైవేట్ పాఠశాల వద్ద ఉన్న ఎలుగుబంటి

మడకశిర: పట్టణంలో గురువారం రాత్రి ఓ ఎలుగుబంటి హల్‌చల్ చేసింది. అటుఇటూ తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురిచేసింది. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఓ ఎలుగుబంటి కనిపించింది. అనంతరం అది సమీపంలోని ఓ ప్రైవేట్ పాఠశాల ఆవరణలో అటూ ఇటూ తిరుగుతుండగా... భయపడిన స్థానికులు పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ దాన్ని కొండ ప్రాంతంలోకి తరిమి వేశారు. గతంలో కూడా పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఎలుగుబంట్లు కనిపించాయి. పట్టణానికి ఆనుకుని కొండ ఉండటం, కొండపై ఉన్న ఎలుగుబంట్లు తాగునీరు, ఆహారం కోసం తరచూ పట్టణంలోకి వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఎలుగుబంట్లు పట్టణంలోకి రాకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

- విత్తన ప్రాసెసింగ్‌ను పరిశీలించిన డీఏఓ సుబ్బారావు



వేరుశనగ కాయల ప్రాసెసింగ్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి సుబ్బారావు

ధర్మవరం రూరల్: ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసే రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) వైవీ సుబ్బారావు ఆదేశించారు. శుక్రవారం ఆయన జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు సనావుల్లా, ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ సుబ్బయ్యతో కలిసి మండలంలోని విజేత అగ్రిటెక్, సాయి సీడ్స్ విత్తన వేరుశనగ ప్రాసెసింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. మొలకశాతం పరిశీలించిన తర్వాతే విత్తనాలు పంపిణీ చేయాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. అన్ని రైతు సేవా కేంద్రాల్లో వేరుశనగ కాయలను నిల్వ ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అదే విధంగా విత్తన సంచుల తూకాలు, తేమ శాతం తదితర వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ ముస్తఫా, ఏఈఓ అశ్వని, ఏపీ సీడ్స్ సిబ్బంది వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీజింగ్ పేరుతో 8 ఏళ్లకే సర్వీస్ పాయింట్లు

అనంతపురం ఎడ్యుకేషన్: డీఎస్సీ–2014లో ఎంపికైన ఉపాధ్యాయులు 2016 జూన్‌లో జాయిన్ అయ్యారు. వారికి 2024 మే 31 నాటికి 8 సంవత్సరాలు పూర్తవుతుంది. అంటే తప్పనిసరిగా బదిలీ కావాలి. 2024 లో ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు జరపలేదు. దీంతో లాంగ్ స్టాండింగ్ అయినా అదే స్థానాల్లో కొనసాగుతూ వచ్చారు. ఇప్పటికి వారి సర్వీస్ 9 సంవత్సరాలు పూర్తయింది. అయితే ప్రస్తుత బదిలీల్లో ఫ్రీజింగ్ పేరుతో ఎనిమిది సంవత్సరాలకే పాయింట్లను కేటాయిస్తున్నారు. ఇది ఎంతవరకు సబబు అని 2014 డీఎస్సీ ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. స్టేషన్ పాయింట్ల విషయంలో ఉపాధ్యాయుడు ఎన్ని సంవత్సరాలు పని చేస్తే అన్ని సంవత్సరాలు కేటాయించాలని గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు గుజ్జల శివయ్య, ప్రధాన కార్యదర్శి డేగావత్ రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. టీచర్ల బదిలీ కోసం పెట్టుకొనే అప్లికేషన్‌లో స్టేషన్ సీనియారిటీ పాయింట్లు, సర్వీస్ సీనియారిటీ పాయింట్లలో పూర్తయిన సంవత్సరాలకు మాత్రమే పాయింట్లు వస్తున్నాయన్నారు. నెలలు, రోజులకు పాయింట్లు రావడం లేదన్నారు. ఫలితంగా టీచర్లు బదిలీల్లో నష్టపోతారన్నారు. ప్రస్తుత స్టేషన్ లో ఎన్ని సంవత్సరాలు పని చేస్తే పూర్తి కాలానికి పాయింట్స్ కేటాయించాలన్నారు.

నియామక జాబితాలు లేవట!

డీఎస్సీ–2002కు సంబంధించిన టీచర్ల నియామక జాబితాలు డీఈఓ కార్యాలయంలో లేవని చెబుతున్నారని ఏపీఎస్‌ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్, ఎస్‌ఎల్‌టీఏ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గాండ్లపర్తి శివానందరెడ్డి, జిల్లా నాయకులు వై.ఆదిశేషయ్య, నరసింహారెడ్డి, ఆపస్ నాయకులు ఎర్రిస్వామి మండిపడ్డారు. టీచర్ల పదోన్నతులు, బదిలీలకు మెరిట్ జాబితాలు అందుబాటులో ఉంచుకోకపోతే ఎలా? అని వారు ప్రశ్నించారు. ఉపాధ్యాయుల సందేహాల నివృత్తికి డీఎస్సీల వారీగా మెరిట్ జాబితాలు అందుబాటులో ఉంచి అడక్వసి ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పగబట్టి.. పంపించేశారు





‘మా ప్రభుత్వం.. మాదే రాజ్యం.. ప్రశ్నించకూడదు.. ఎదురు చెప్పకూడదు’ అన్నట్లు టీడీపీ ప్రజాప్రతినిధులు, నేతలు వ్యవహరిస్తున్నారు. వంగి వంగి దండాలు పెడితే సరి.. లేకపోతే దండనకు సిద్ధంగా ఉండాలంటూ హెచ్చరికలు పంపుతున్నారు. తప్పు చేయకపోయినా కుట్ర చేసి మరీ బదిలీ బహుమానంగా ఇస్తున్నారు. తాజాగా ముగ్గురు ఎమ్మెల్యేలు ఏకమై.. కక్షగట్టి జెడ్పీ సీఈఓ రాజోలి రామచంద్రారెడ్డిని బదిలీ చేయించిన తీరుతో ఉద్యోగులంతా హడలిపోతున్నారు.

- ముగ్గురు ఎమ్మెల్యేల దెబ్బకు జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి బదిలీ
- స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో సహకరించలేదని అక్కసు
- ఓ ఎంపీడీఓకు పోస్టింగ్ విషయంలోనూ ఎమ్మెల్యే అమిలినేని అసంతృప్తి
- జెడ్పీ సమావేశానికి వచ్చి చైర్‌పర్సన్ చాంబర్‌లో చంద్రబాబు ఫొటో లేదంటూ రగడ
- ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి... పోస్టింగ్ కూడా ఇవ్వకుండా కసి తీర్చుకున్న వైనం
- నిజాయితీ అధికారుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీశారంటున్న ఉద్యోగులు

అనంతపురం సిటీ: ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈఓ) రాజోలి రామచంద్రారెడ్డి విధి నిర్వహణలో నిజాయితీ, నిబద్ధత కలిగిన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. ఎక్కడ పని చేసినా.. ముక్కుసూటిగా పని చేయడంతో పాటు సౌమ్యుడిగా, వివాదరహితుడిగా గుర్తింపు పొందారు. నంద్యాల జిల్లా డ్వామా పీడీగా పని చేస్తున్న ఆయన్ను కూటమి ప్రభుత్వం కొన్ని నెలల క్రితం అనంతపురం జెడ్పీ సీఈఓగా బదిలీ చేసింది. డిసెంబర్ 28న ఆయన సీఈఓగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి ప్రభుత్వ ప్రాధాన్యాల మేరకు పని చేశారు. అనతి కాలంలోనే సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు తెచ్చుకోగలిగారు. అలాంటి అధికారిని అధికార టీడీపీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు టార్గెట్ చేశారు. ఎలాగైనా జిల్లా దాటించాలని కంకణం కట్టుకున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ చాంబర్‌లో సీఎం ఫొటో సరైన స్థానంలో లేదంటూ రచ్చచేసి... దానికి సీఈఓను బాధ్యున్ని చేసి... ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి బదిలీ చేయించారు.

రామచంద్రారెడ్డిపై కక్ష ఎందుకంటే..

వివిధ కారణాలతో ఖాళీ ఏర్పడ్డ స్థానిక సంస్థల పదవులకు ఇటీవల ఉప ఎన్నికలు నిర్వహించారు. ఆ సందర్భంలో కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కంబదూరు మండల ఉపాధ్యక్ష (వైస్ ఎంపీపీ) స్థానానికీ ఉప ఎన్నిక జరిగిన సంగతి తెలిసిందే. ఆ ఎన్నికను ఎలాగైనా వాయిదా వేయించాలని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అక్కడి ఎంపీడీఓపై ఒత్తిడి తెచ్చారు. ‘ఇది ఎన్నికల కమిషన్ నిర్ణయం. మా చేతుల్లో ఏమీ ఉండదు సర్’ అంటూ అక్కడి అధికారి సమాధానమిచ్చారని తెలిసింది. దీంతో జెడ్పీ సీఈఓ ద్వారా ఎన్నిక వాయిదా వేయించాలనుకున్నా... అందుకు సీఈఓ అంగీకరించకపోవడంతో కక్ష పెంచుకున్నట్లు తెలుస్తోంది. అంతకుముందు జిల్లాలో 15 మంది డిప్యూటీ ఎంపీడీఓ(ఈఓపీఆర్‌డీలు)లు, ఏఓలకు ఎంపీడీఓలుగా పదోన్నతులు రాగా, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి పదోన్నతిపై మరో ఐదుగురు ఎంపీడీఓలు జిల్లాకు వచ్చారు. వారికి పోస్టింగ్ వేసే క్రమంలో కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని బ్రహ్మసముద్రం ఎంపీడీఓగా విజయసింహారెడ్డికి పోస్టింగ్ ఇచ్చారు. ఆయనకు పోస్టింగ్ ఇచ్చే ముందు ఎమ్మెల్యే తనయుడితో పాటు పీఏకూ సమాచారం ఇచ్చినట్లు సమాచారం. అయితే కూతురి పెళ్లి ఏర్పాట్లలో బిజీగా ఉన్న ఎమ్మెల్యే తనకు తెలియకుండా ఎంపీడీఓకు పోస్టింగ్ ఇచ్చారని ఆగ్రహించి విజయ సింహారెడ్డిని వెనక్కి పంపేశారని సమాచారం. ఈ రెండు అంశాలను మనసులో పెట్టుకున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు.. మడకశిర, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, దగ్గుపాటి ప్రసాద్‌ను కలుపుకొని.. సీఈఓ రామచంద్రారెడ్డిపై కక్ష గట్టినట్లు స్పష్టమవుతోంది.

మహిళా చైర్‌పర్సన్ చాంబర్‌లోకి ప్రవేశించి..

బోయ సామాజిక వర్గానికి చెందిన గిరిజమ్మ వైఎస్సార్‌సీపీ గుర్తుపై గెలిచి జెడ్పీ చైర్‌పర్సన్ అయ్యారు. ఆమె పదవీకాలం ఇంకా 15 నెలలు ఉంది. బీసీ కులం నుంచి వచ్చిన గిరిజమ్మ తమ అభిమాన నేత, మాజీ సీఎం జగన్ ఫొటోను తన చాంబర్‌లో ఉంచారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటో కూడా తన చాంబర్‌లో ఏర్పాటు చేయించారు. అయితే ఈ నెల 21న జెడ్పీ సర్వసభ్య సమావేశం జరుగుతుండగానే...ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి తదితరులు జెడ్పీ చైర్‌పర్సన్ చాంబర్‌లోకి చొరబడ్డారు. జిల్లా ప్రథమ పౌరురాలు, కేబినెట్ ర్యాంకు కలిగిన ప్రజాప్రతినిధి చాంబర్‌లోకి దూసుకెళ్లి చంద్రబాబు ఫొటో ఎక్కడంటూ రచ్చ చేశారు. ఈ సమయంలోనే జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డిని నోటికొచ్చినట్లు మాట్లాడారు. గ్రూప్–1 అధికారి అన్న గౌరవం కూడా లేకుండా అవమానించారు. ఆ తరువాత మాజీ సీఎం జగన్ ఫొటోను బలవంతంగా తీయించి, గాంధీజీ ఫొటో స్థానంలో సీఎం చంద్రబాబు ఫొటో పెట్టించారు. అంతటితో ఈ వివాదం సద్దుమణిగిందని అందరూ అనుకున్నారు.



అనంతపురం జెడ్పీ కార్యాలయంలోని తన చాంబర్‌లో డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్యకు చార్జ్ అప్పగిస్తున్న సీఈఓ రాజోలి రామచంద్రారెడ్డి

కూడబలుక్కొని.. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి..

జెడ్పీ సీఈఓపై కోపం చల్లారని ముగ్గురు ఎమ్మెల్యేలు మరో ప్లాన్ వేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఒకే రోజు వ్యవధిలో ఆయన్ను బదిలీ చేయించి తమ పంతం నెగ్గించుకున్నారు. దీన్ని ఉద్యోగులు జీర్ణించుకోలేకపోతున్నారు. టీడీపీకి చెందిన ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు సైతం తప్పుబడుతున్నారు. నిజాయితీ అధికారుల ఆత్మస్థైర్యం దెబ్బతీస్తే.. అది ప్రభుత్వానికే ముప్పుగా పరిణమిస్తుందని బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులు తమ స్వార్థ రాజకీయాలకు జెడ్పీ సీఈఓను బలిచేయడం దుర్మార్గమంటున్నారు. ఇలాగైతే జిల్లాలో పని చేసే పరిస్థితులు ఉండవని, ఈ పరిణామాలన్నీ ప్రభుత్వానికి మాయని మచ్చగా మిగులుతాయంటున్నారు. ప్రభుత్వ పెద్దలు కూడా వాస్తవ పరిస్థితులు తెలుసుకొని నిర్ణయాలు తీసుకుంటే మంచిదని సూచిస్తున్నారు.

బదిలీల తిప్పలు

- సర్వర్ మొరాయిస్తుండటంలో ఆప్షన్లకు ప్రతిబంధకం
- సింగిల్ టీచర్ ఉన్న చోట డిజేబుల్డ్ అభ్యర్థులకు నో ఛాన్స్
- ఖాళీలపై పారదర్శకత లేకపోవడంతో భయపడుతున్న టీచర్లు
- సర్వీసు పాయింట్ల నమోదులోనూ అవకతవకలు
- నేటితో ఆప్షన్లకు చివరి రోజు కావడంతో అందరిలోనూ ఒకటే భయం
- ఉన్నతాధికారులు, సర్కారు తీరుపై వేలాదిమంది టీచర్ల అనుమానాలు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉపాధ్యాయుల బదిలీల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలు వేలాది మంది ఉపాధ్యాయులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఎన్నో ఏళ్లుగా దూర ప్రాంతాల్లో పని చేస్తూ ఈ బదిలీల్లో దగ్గరకు రావాలనుకుంటున్న వారి ఆశలు అడియాసలు అవుతున్నాయి. బదిలీల్లో డీఈఓ కార్యాలయంలో అన్నీ గోప్యంగా ఉండటం, ఎక్కడ వేకెన్సీలు ఉన్నాయో ఇప్పటికీ తెలియకపోవడం, ఆప్షన్లు పెట్టుకుందామంటే ఎక్కడ పోస్టులున్నాయో తెలియక పోవడం, ఫిజికల్లీ ఛాలెంజ్‌డ్ అభ్యర్థులకు పోస్టింగ్‌లో మెలికలు వంటి కారణాలతో వేలాదిమంది టీచర్లు ఆందోళనలో ఉన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాదాపు ఏడు వేల మందికి పైగా ఉపాధ్యాయులకు బదిలీ అవకాశం ఉంది. కానీ పారదర్శకత లేకపోవడమే వారిని కలవర పెడుతోంది.

సర్వర్ మొరాయింపుతో ఆప్షన్లకు ఆటంకం

టీచర్ల బదిలీకి విద్యాశాఖ ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించింది. ఏ టీచర్ అయినా ఈ వెబ్‌సైట్ ద్వారానే బదిలీకి ఆప్షన్ ఇవ్వాలి. దీనికి నేటితో అంటే మే 24తో గడువు ముగుస్తుంది. కానీ ఇక్కడ సర్వర్ పని చేయడం లేదు. ఓపెన్ అయిన ఐదు నిమిషాల్లోనే మళ్లీ కట్ అవుతోంది. దీంతో ఆప్షన్లకు మధ్యలోనే ఆటంకం ఎదురవుతోంది. వందలాది మంది ఉపాధ్యాయులు సర్వర్ పనిచేయకపోవడంతో ఆప్షన్లు ఇవ్వలేకపోతున్నారు. మరో రెండు రోజులు గడువు పెంచాలని కోరుతున్నారు.

సింగిల్ టీచర్ ఉన్నచోటుకు మేమెందుకు వెళ్లకూడదు?

సింగిల్ టీచర్ ఉన్న చోట రకరకాల ప్రాధాన్యత (ప్రిఫరెన్షియల్) ఉపాధ్యాయులు వెళ్లకూడదని జీవోలో ఇవ్వడంపై ఫిజికల్లీ ఛాలెంజ్‌డ్ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదాహరణకు బుక్కరాయసముద్రం హైస్కూలులో ఒక సబ్జెక్టుకు సింగిల్ టీచర్ ఉండి ట్రాన్స్‌ఫర్ అయినా, లేదా వేకెన్సీ ఉన్నా అక్కడకు మరో అంధ, ఆర్థోపెడిక్ వైకల్యం, వితంతు, క్యాన్సర్ పేషెంట్ ఇలాంటి వాళ్లు వెళ్లడానికి వీలు లేదని ఉంది. దీనివల్ల తమకు సీనియారిటీ ఉన్నా కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందని, తీవ్ర అన్యాయం జరుగుతోందని వారు చెబుతున్నారు.

సీనియారిటీ పాయింట్లలో గందరగోళం

జీఓను అనుసరించి సర్వీసునుబట్టి, రూరల్‌లో పని చేస్తున్న, స్టేషన్ సీనియారిటీ వంటివి ఆధారంగా పాయింట్లు వస్తాయి. కానీ ఆప్షన్లు ఇస్తున్న కొంత మంది టీచర్లకు తమ పాయింట్లు లేవు. కొంతమంది అర్హత లేని టీచర్లకు పాయింట్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీంతో రెండ్రోజులుగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. కనీసం దీనిపై డీఈఓ కార్యాలయాల్లో స్పందించేవారే లేరు. ఎవర్ని అడగాలో తెలియక, ఎక్కడ సమస్యకు పరిష్కారం దొరుకుతుందో తెలియక సతమతమవుతున్నారు. గతంలో ఏ సర్కారూ ఇలా గందరగోళ పరిస్థితులను సృష్టించలేదని వాపోతున్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం అగ్రికల్చర్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంప్యూటర్ కోర్సులపై యువతకు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 10 పాస్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ ఫెయిల్ లేదా పాసై ఉండాలన్నారు. 18 నుంచి 28 సంవత్సరాల వయస్సున వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి బెంగళూరులో 35 రోజుల పాటు ఉచిత శిక్షణ, వసతి, భోజన సదుపాయం ఉంటుందన్నారు. కంప్యూటర్, ట్యాలీ కోర్సులతో పాటు స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ స్కిల్స్ అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు 9000487423 నంబరులో సంప్రదించాలన్నారు.

రేషన్ పంపిణీలో అక్రమాలు సహించం

- జూన్ నుంచి రేషన్ దుకాణాల వద్దే సరుకుల పంపిణీ
- కలెక్టర్ టీఎస్ చేతన్



రేషన్ పంపిణీపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్, జేసీ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలను సహించబోమని కలెక్టర్ చేతన్ స్పష్టం చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాల శాఖ అధికారులు, డీలర్లను హెచ్చరించారు. శుక్రవారం ఆయన జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలసి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పౌరసరఫరాల శాఖ సీఎస్‌డీటీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 1,367 రేషన్ దుకాణాలున్నాయని, ఆయా దుకాణాల పరిధిలోని కార్డుదారులందరికీ రేషన్ సరుకులు పంపిణీ పక్కాగా జరగాలన్నారు. జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల వద్దే నిత్యావసరాలు పంపిణీ జరుగుతుందన్నారు. ప్రతి నెలా 1వ తేదీ నుండీ 15వ తేదీ వరకు రేషన్ దుకాణాల ద్వారా సరుకులు పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి రేషన్ దుకాణం వద్ద ధరల పట్టిక, సరుకుల నిల్వలను సూచించే బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. 65 ఏళ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి, జిల్లాలోని పలువురు సీఎస్‌డీటీలు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రగతితోనే యువతకు ఉపాధి

పారిశ్రామిక ప్రగతితోనే యువతకు ఉపాధి కల్పన సాధ్యమవుతుందని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో పరిశ్రమల స్థాపన, సోలార్ ప్రాజెక్ట్ భూసేకరణ అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరిశ్రమల ఏర్పాటు, సోలార్ ప్రాజెక్ట్‌కు అవసరమైన భూసేకరణను వెంటనే చేపట్టాలన్నారు. జిల్లాలో 7,000 మెగావాట్ల సోలార్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు 35 వేల ఎకరాలు అవసరం కాగా, మడకశిర ప్రాంతంలో 25 వేల ఎకరాలు గుర్తించామన్నారు. భూసేకరణకు గ్రామ సభలు నిర్వహించాలన్నారు. రైతుల భూములు సేకరించాల్సిన చోట వారికి అవగాహన కల్పించి... అనుమతులను నివేదిక రూపంలో జూన్ 15వ తేదీలోపు సమర్పించాలన్నారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పుట్టపర్తి, పెనుకొండ, కదిరి, ధర్మవరం ఆర్డీఓలు సువర్ణ, ఆనంద్‌కుమార్, శర్మ, మహేష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, ల్యాండ్ సర్వే ఏడీఈ విజయశాంతి బాయి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోనీ సహాని, సోలార్ ప్రాజెక్ట్ పీడీ శివశంకర్ నాయుడు, వివిధ మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

ముందస్తుగా ఆశల ‘నైరుతి’



మేఘావృతమైన ఆకాశం

- సాధారణంగా జూన్ రెండో వారంలోనే జిల్లాకు రుతుపవనాలు
- అయితే ఈ సారి ఈ నెలాఖరుకే ప్రవేశిస్తాయని శాస్త్రవేత్తల వెల్లడి
- జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య ‘ఖరీఫ్’కు నైరుతి ప్రభావంతో వర్షాలు
- 319.6 మి.మీ సాధారణం కన్నా అధిక వర్షపాతంపై అన్నదాత ఆశలు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో నైరుతి రుతుపవనాలు ప్రవేశం ఇలా..

సంవత్సరం	ప్రవేశం
2014	జూన్ 15
2015	జూన్ 10
2016	జూన్ 9
2017	జూన్ 11
2018	జూన్ 4
2019	జూన్ 21
2020	జూన్ 7
2021	జూన్ 6
2022	జూన్ 13
2023	జూన్ 12
2024	జూన్ 2
2025	??

అనంతపురం అగ్రికల్చర్: ఆశల ‘నైరుతి’ ముందస్తుగానే ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ శాఖ తీపి కబురు చెబుతోంది. సాధారణంగా జూన్ ఒకటిన కేరళను తాకే ‘నైరుతి’ ఈసారి ఈ నెల 26నే తాకనున్నాయని ప్రకటించింది. రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నందున ఈ నెల 29 నాటికే ఉమ్మడి ‘అనంత’లోకి ప్రవేశిస్తాయని అంచనా వేస్తున్నారు. చరిత్రను పరిశీలిస్తే.. జూన్ రెండో వారంలో చాలాసార్లు రుతుపవనాలు జిల్లాలోకి ప్రవేశించాయి. అయితే ఈసారి దాదాపు 10 రోజులు ముందుగానే ‘నైరుతి’ పలకరించనుంది. ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి లక్షలాది హెక్టార్ల ఖరీఫ్ సాగుకు నైరుతి రుతుపవనాలు (సౌత్‌వెస్ట్ మాన్‌సూన్స్) అత్యంత కీలకం. జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో ప్రభావం చూపిస్తే మంచి వర్షాలు నమోదు కావాల్సి ఉంటుంది.

నైరుతి వర్షాలపై గంపెడాశలు

ఉమ్మడి జిల్లా పరిధిలో దాదాపు 7 లక్షల హెక్టార్లలో సాగులోకి వచ్చే ఖరీఫ్ పంటలకు నైరుతి రుతుపవనాల ప్రభావంతో కురిసే వర్షాలే కీలకం. జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య నాలుగు నెలల పాటు వీటి ప్రభావంతో వర్షాలు నమోదవుతాయి. జిల్లా వార్షిక సాధారణ వర్షపాతం 512.4 మి.మీ కాగా అందులో కీలకమైన ఖరీఫ్ నాలుగు నెలల కాలంలో 319.7 మి.మీ నమోదు కావాల్సి ఉంటుంది. జూన్‌లో 61 మి.మీ., జూలైలో 63.9, ఆగస్టులో 83.8, సెప్టెంబర్‌లో 110.9 మి.మీ సాధారణ వర్షపాతంగా నిర్ధారించారు. నైరుతి ప్రభావంతో కురిసే వర్షాలపై ఆధారపడి ఉమ్మడి జిల్లాలో దాదాపుగా 20 లక్షల ఎకరాల భారీ విస్తీర్ణంలో వేరుశనగ, కంది, ఆముదం, పత్తి, మొక్కజొన్నతో పాటు మరో 15 రకాల పంటలు సాగు చేస్తారు. ఆ తర్వాత అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు రబీ కాలంలో ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో వర్షాలు నమోదవుతాయి.

ఆక్రమణల ‘తమ్ముడు’..అడిగేవారే లేరు



కొడిగేపల్లి సమీపంలో టీడీపీ నేతకు చెందిన పెట్రోల్ బంక్ వద్ద కాలువను మూసి ఆర్‌అండ్‌బీ స్థలాన్ని చదును చేసిన దృశ్యం (తాజా చిత్రం)



టీడీపీ నేత పెట్రోల్ బంక్ వద్ద డ్రైన్ ద్వారా నీరు వెళ్తున్న దృశ్యం (పాత చిత్రం)

- పురంలో రెచ్చిపోతున్న టీడీపీ నేత చంద్రమోహన్
- డ్రైన్ వెయ్యనీయకుండా అడ్డుకుని రోడ్డు ఆక్రమణ

సాక్షి టాస్క్ ఫోర్స్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక టీడీపీ నేతల దౌర్జన్యాలు, దుర్మార్గాలు, ఆక్రమణలకు అంతేలేకుండా పోతోంది. ముఖ్యంగా బాలకృష్ణ ప్రాతినిథ్యం వహిస్తున్న హిందూపురంలో ఆ పార్టీ నేతలు ఖాళీ జాగా కనిపిస్తే చాలు కబ్జా చేస్తున్నారు. ఇక మోతుకపల్లికి చెందిన టీడీపీ నేత చంద్రమోహన్ ఏకంగా ఆస్తులపై కన్నేసి మరీ ఆక్రమణల పర్వం కొనసాగిస్తున్నాడు.

డ్రైన్‌ను పూడ్చేసి... చదును చేసి

హిందూపురం – పరిగి ప్రధాన రహదారి కొడిగేపల్లి పంచాయతీ పరిధిలో చంద్రమోహన్‌కు పెట్రోల్ బంక్ ఉంది. ఈ బంకు వద్ద డ్రైన్ నిర్మించేందుకు గతంలో అధికారులు ప్రయత్నించగా అడ్డుకున్నాడు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ రావడం, ఆపై కూటమి అధికారంలోకి రావడంతో చంద్రమోహన్ రెచ్చిపోయాడు. తాజాగా ఏకంగా పాత డ్రైన్‌ను పూడ్చి వేసి భూమిని చదును చేయించి రోడ్డునే ఆక్రమించాడు. ఆయనకు ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏల అండ ఉండటంతో అటు అధికారులు, ఇటు ప్రజలు ఆయన దుర్మార్గంపై కనీసం నోరు మెదపలేకపోతున్నారు.

జంట హత్యల కేసులో మరొకరికి రిమాండ్

రాప్తాడు: మండలంలోని గొల్లపల్లి దగ్గర జరిగిన చిగిచెర్ల నారాయణరెడ్డి, ముత్యాలమ్మ జంట హత్య కేసులో ఏడుగురు నిందితుల అరెస్ట్ తర్వాత తాజాగా మరో నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీహర్ష తెలిపారు. హత్య జరిగిన సమయంలో గాయపడిన పామాల కొండప్ప అలియాస్ లక్షల కొండప్ప అనే నిందితుడు అనంతపురంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం నిండితుడు కొండప్ప డిశ్చార్జ్ కావడంతో పోలీసులు వెంటనే తమ అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా.. బాల నరసింహారెడ్డి కోర్టులో ఎలా లొంగిపోయాడో అదే రీతిలో లొంగిపోవాలని మిగిలిన మరో ముగ్గురు నిందితులు పామాల్ల పండయ్య, గొనిపట్ల శీనా, పాత్రి కేయుడు గొల్లపల్లికి చెందిన పెద్దింటి జగదీష్ భావిస్తున్నట్లు సమాచారం. వీరిలో ఒక నిందితుడి సోదరుడు పోలీసు ఉన్నతాధికారి కావడంతోనే ఆయన సలహాతోనే వారు పోలీసులకు దొరకకుండా తిరుగుతున్నట్లు తెలిసింది.

రేపు కనకదాస ప్రతిభా పురస్కారాల ప్రదానం

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చాటిన ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కురుబ సామాజిక విద్యార్థులకు ఈనెల 25న కనకదాస ప్రతిభా పురస్కారాలు పంపిణీ చేయనున్నట్లు కురుబ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అర్వేటి పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గుత్తిరోడ్డులోని కనకదాస కల్యాణ మండపంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.



ప్రత్యేక పూజలు అందుకుంటున్న వన్నూరుస్వామి

వన్నూరప్ప అని పిలిస్తే ఆ గ్రామంలో వంద మంది పలుకుతారు. వన్నూరప్ప, వన్నూరమ్మ, వన్నూర్‌రెడ్డి, వన్నూరక్క ఇలా.. హజరత్ వన్నూరు వలి సాహెబ్‌ను కొలిచే వారందరూ ఆయన పేరే పెట్టుకున్నారు. 30 ఏళ్లు పైబడిన సుమారు 100 మంది దాకా స్వామి పేరునే పెట్టుకున్నారంటే ఆయన మహిమ ఎలాంటిదో అర్థమవుతుంది.



మరవపల్లి గ్రామం వ్యూ

ఊరంతా వన్నూరప్ప, వన్నూరమ్మలే..

● మరువపల్లిలో వంద మందికి పైగా ఆ పేర్లతోనే.. ● గ్రామమంతా వన్నూరుస్వామిని కొలుస్తున్న వైనం ● ఏ శుభ కార్యమైనా ఆలయం వద్ద చక్కెర చదివింపులు



మహిమగల బావి ఇదే



మరవపల్లిలో వెలసిన వన్నూరుస్వామి ఆలయం



తాడిమర్రి: మండలంలోని మరవపల్లి గ్రామంలో వెలసిన హజరత్ వన్నూరు వలి సాహెబ్ (వన్నూరు స్వామి) కొలిచిన వారికి కొంగు బంగారంగా విరాజిల్లుతున్నారు. మండలంలోని మరవపల్లి గ్రామ ఇలవేల్పుగా స్వామి వెలుగొందుతున్నారు. గ్రామ ప్రజలకు ఎలాంటి ఆపదలు, జబ్బులు రాకుండా కాపాడుతున్నాడు. దీంతో గ్రామంలో ఎక్కువ మంది స్వామి పేరు కలసి వచ్చేలా పేర్లను పెట్టుకుంటున్నారు.

200 ఏళ్ల క్రితం వెలసిన వన్నూరు స్వామి

ఇప్పుడున్న మరవపల్లి గ్రామంలో 200 ఏళ్ల కిత్రం రెండు, మూడు గుడిసెలు ఉండేవట. ఆ కాలంలో ఇప్పుడున్న ఎం.అగ్రహారం గ్రామం చెరువు పనులు జరుగుతుండగా కడప జిల్లా లింగాల మండలం అంకేన్‌పల్లికి చెందిన కొందరు ఇక్కడ చెరువు పనులు చేస్తూ గుడిసెల్లో ఉండేవారని పెద్దలు చెబుతున్నారు. ఆ సమయంలోనే కణేకల్లు సమీపంలోని వన్నూరు గ్రామానికి చెందిన వన్నూరుస్వామి గుర్రంపై తూర్పు ప్రాంతానికి యుద్ధానికి వెళ్లారట. తిరుగు ప్రయాణంలో గుడిసెల వద్ద ఆగి వేపపుల్లతో పళ్లు తోముకుని పళ్లు తోముకున్న పుల్లను ఓ చోట భూమిపై గుచ్చారని అంటున్నారు. దీంతో అక్కడ వేపమాను మహావృక్షమైందని అంటున్నారు. ఆ మహనీయుడు అక్కడే ఉన్న బావిలో ముఖం కడుక్కొని ఆయన అక్కడే పాదరక్షలు వదిలి వెళ్లిపోయారట. గుడిసెల్లో ఉన్నవారు ఆ వృక్షం వద్ద పూజలు చేస్తూ వచ్చారని, దీంతో గ్రామస్తులకు ఎలాంటి ఆపదలు రాకుండా వన్నూరుస్వామి కాపాడుతూ వచ్చరని భక్తుల నమ్మకం.

స్వామి మహిమలు ఇలా..

సుమారు 60 ఏళ్ల క్రితం గ్రామానికి ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎం.అగ్రహారంలో కలరా వచ్చిందని గ్రామ పెద్దలు చెబుతున్నారు. కలరాతో పదుల సంఖ్యలో గ్రామస్తులు మృతి చెందారట. అలాంటి విపత్కర సమయంలో కూడా మరవపల్లిలో ఒక్కరికీ కూడా కలరా సోకలేదని అంటున్నారు. ఆలయం పక్కన ఉన్న బావిలో వన్నూరు స్వామి ముఖం కడుక్కోవడంతో ఆ బావిలో మహిమలు ఉన్నాయని గ్రామస్తులు నమ్ముతారు. పదేళ్ల క్రితం గ్రామానికి చెందిన అంధురాలు లింగమ్మ జీవితంపై విరక్తితో చనిపోవాలని బావిలోకి దూకిందట. దేవుని మహిమతో ఆమె ఎలాంటి ప్రమాదం జరగకుండా క్షేమంగా బయటపడిందని చెబుతున్నారు. అలాగే బావి ఒడ్డున ఉన్న అరుగుపై పలువురు పిల్లలు ఆడుకుంటూ బావిలో పడిని చిన్నపాటి గాయం కూడా కాలేదంటున్నారు. దీంతో బావి రోడ్డు పక్కన ఉన్నప్పటికీ పూడ్చకుండా అలాగే ఉంచారు. నార్పలకు చెందిన శంకరయ్య అనే వ్యక్తి గత కొన్నేళ్ల క్రితం తన భార్యకు ఆరోగ్యం బాగాలేక లక్షలు ఖర్చుచేసి ఎన్నో ఆస్పత్రుల్లో చూపించారు. అయినా జబ్బు నయం కాలేదు. చివరకు గ్రామస్తుల ద్వారా స్వామి మహిమ గురించి తెలుసుకుని భార్యాభర్తలు కొన్నాళ్ల పాటు ఆలయానికి వచ్చి పూజలు చేసి, అక్కడే నిద్రించారు. దీంతో ఆమె ఆరోగ్యం కుదుట పడింది. దీంతో ఆయన అప్పటి నుంచి ప్రతి గురువారం గ్రామానికి వచ్చి 10, 20 కిలోలు చక్కెర తీసుకొచ్చి స్వామికి చదివించి వెళుతున్నారు.

ప్రతి గురువారం ప్రత్యేక పూజలు

వన్నూరుస్వామి ఆలయంలో గ్రామస్తులు ప్రతి గురువారం ప్రత్యేక పూజలు చేస్తారు. గతంలో గ్రామస్తులే పూజలు చేసేవారు. కొంత కాలంగా మరవపల్లికి చెందిన ముస్లిం కుటుంబానికి చెందిన వ్యక్తిని పూజారిగా నియమించారు. ఆయన ప్రతి గురువారం స్వామికి దీపాలను వెలిగించి చక్కెర చదివించి భక్తులకు పంచి పెడతారు. అలాగే కోర్కెలు నెరవేరిన భక్తులు స్వామికి పొట్టేళ్లను కొట్టి గ్రామస్తులకు పంచుతారు. కందూరి చేసినప్పుడు స్వామి ఉత్సవ విగ్రహాన్ని పూలతో అలంకరించి ఉత్సవ పల్లకీలో ఉంచి గ్రామంలో ఊరేగిస్తారు. అలాగే వ్యవసాయ పనులు ప్రారంభం, శుభకార్యాలు జరినప్పుడు గ్రామస్తులు ముందుగా ఆలయంలో చక్కెర చదివించి ప్రారంభిస్తారు. దీంతో ఎలాంటి ఆటంకం లేకుండా పనులు, శుభ కార్యాలు నిర్విఘ్నంగా జరుగుతాయని గ్రామస్తుల విశ్వాసం.

కోరిన కోర్కెలు తీర్చే దేవుడు



గ్రామంలో వెలసిన వన్నూరు స్వామి కోరిన కోర్కెలు తీర్చే దేవుడు. గ్రామంలో ఎవరు, ఎలాంటి శుభకార్యక్రమాలు చేపట్టిన ముందుగా ఆలయంలో దీపాలు వెలిగించి, చక్కెర చదివింపులు చేస్తాం. ఇలా చేయడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండకుండా పనులన్నీ సాఫీగా జరిగిపోతాయి.
– సాకే వన్నూరప్ప, మరవపల్లి, తాడిమర్రి

రోగాలైనా నయం అవుతాయి



వన్నూరుస్వామి ఆలయంలో నిద్రచేస్తే ఎలాంటి రోగాలు అయినా నయం అవుతాయి. ప్రపంచాన్ని గడగడ లాండించిన కరోనా కాలంలో ప్రజలు ఎంతో భయభ్రాంతులకు గురయ్యారు. చుట్టుపక్కల గ్రామాలు కరోనాతో విలవిల లాడాయి. అలాంటి విపత్కర పరిస్థితిలో కూడా మా గ్రామంలో ఎక్కరికి కూడా కరోనా సోకుండా స్వామి కాపాడారు.
– గాంధ్లపర్తి కుళ్లాయరెడ్డి, మరవపల్లి, తాడిమర్రి

అదృశ్యమైన మహిళలు ఉరవకొండలో ప్రత్యక్షం

ఉరవకొండ: కళ్యాణదుర్గం పట్టణంలోని పార్వతీనగర్‌లో ఉన్న ఉజ్వల హోం నుంచి ఈనెల 22న అదృశ్యమైన ఇద్దరు మహిళల ఆచూకీ లభించింది. ఉరవకొండ అర్బన్ సీఐ మహానంది వివరాల మేరకు.. కుందుర్పి, కణేకల్లు మండలాలకు చెందిన యువతులు కళ్యాణదుర్గంలోని ఉజ్వల హోం నుంచి అదృశ్యమైనట్లు సోషల్ మీడియాలో పోస్టు చేశామన్నారు. ఉరవకొండ బస్టాండ్‌లో వారిని స్థానికులు గుర్తించి తమకు సమాచారం ఇచ్చారని తెలిపారు. వెంటనే వారిని కళ్యాణదుర్గం పోలీసులకు అప్పగించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి



ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

విడపనకల్లు: మండల పరిధిలోని హంచనహాళ్ సమీపంలోని 67వ జాతీయ రహదారిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ ఈరన్న (42) మృతి చెందాడు. కర్ణాటకలోని కంప్లీ నుంచి గుంతకల్లు వైపు వెళ్తున్న లారీ మండల పరిధిలోని హంచనహాళ్ సమీపంలోకి రాగానే టైర్ పంక్చర్ కావడంతో డ్రైవర్ లారీని ఆపి టైరు కింద రాళ్ళను పెట్టేందుకు వెనుక వైపునకు వెళ్ళాడు. అదే సమయంలో గుంతకల్లు వైపు నుంచి వస్తున్న లారీ వేగంగా వచ్చి పంక్చరైన లారీని ఢీకొట్టింది. ఘటనలో డ్రైవర్ ఈరన్న అక్కడికక్కడే చనిపోయాడు. విడపనకల్లు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కమీషన్ల కక్కుర్తికి బాలుడి ప్రాణాలు బలి

● బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు ఇవ్వాలని సీపీఐ నేత జగదీష్ డిమాండ్



గోడ పెచ్చులూడి బాలుడు మృతి చెందిన ప్రదేశాన్ని చూపుతున్న సీపీఐ నేత జగదీష్

గుంతకల్లు: నాసిరకం నిర్మాణ పనులతో ప్రజల ప్రాణాలను పాట్టన పెట్టుకుంటున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీ.జగదీష్ విమర్శించారు. శుక్రవారం గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో పెచ్చులూడి పడి మణికంఠ అనే బాలుడు మృతి చెందిన విషయం తెలుసుకున్న సీపీఐ, సీపీఎం నాయకుల బృందం వేర్వురుగా స్థానిక రైల్వేస్టేషన్‌లోని 6–7 నంబర్ల ప్లాట్‌ఫారాల్లో ఘటన జరిగిన ప్రదేశాన్ని సందర్శించారు. అనంతరం సీపీఐ నేత జగదీష్ విలేకరులతో మాట్లాడారు. గుంతకల్లు రైల్వేస్టేషన్‌ను రూ.కోట్ల ఖర్చుతో ఆధునీకరించారన్నారు. రైల్వే అధికారులు కమీషన్లు, పర్సంటేజీలకు కక్కుర్తిపడి నాసిరకం నిర్మాణాలను పట్టించుకోలేదన్నారు. నాసిరకం పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్ పెట్టడంతో పాటు సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మణికంఠ కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించడంతో పాటు వారి కుటుంబంలో ఒకరికి రైల్వే ఉద్యోగమిచ్చి ఆదుకోవాలన్నారు. అంతకుముందు సీపీఐ నాయకుల బృందాన్ని రైల్వేస్టేషన్‌లోకి వెళ్లకుండా ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఆర్‌పీఎఫ్‌పై అధికారి అనుమతితో వారిని స్టేషన్‌లోపలికి అనుమతి ఇచ్చారు.కార్యక్రమంలో సీపీఐ నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, మహేష్, గోపీనాథ్, రాముడాయల్, ఎస్‌ఎండీ గౌస్ పాల్గొన్నారు.

ఎలుగు దాడిలో వ్యక్తికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: ఎలుగు బంటి దాడిలో వ్యక్తి గాయపడిన సంఘటన శుక్రవారం జరిగింది. మండల పరిధిలోని మోరేపల్లికి చెందిన బాలరాయుడు తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లిన సమయంలో ఎలుగు బంటి దాడిచేసింది. ఆయన కేకలు వేయటంతో ఎలుగు బంటి పక్కనే ఉన్న పొదల్లోకి పారిపోయింది. గాయపడిన బాలరాయుడు కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

● ఆర్టీసీ అధికారులకు కలెక్టర్ చేతన్ ఆదేశం
● పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్ పరిశీలన



క్యూఆర్ కోడ్ ద్వారా టికెట్ పొందే విధానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్: ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్సు సర్వీసులు, పారిశుద్ధ్య పనుల నిర్వహణ, ప్లాట్‌ఫారం, మౌలిక వసతుల కల్పన తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మరుగుదొడ్ల స్థితగతులు, హోటళ్లు, సమాచార కేంద్రం, రిజర్వేషన్ కౌంటర్ల పనితీరుపై ఆరా తీశారు. అనంతరం ఆర్టీసీ సంస్థ ప్రయాణికులకు అందిస్తున్న సేవలు గురించి ప్రయాణికులనే అడిగి తెలుసుకున్నారు. క్యూఆర్ కోడ్ ఉపయోగించి డిజిటల్ పేమెంట్ ద్వారా టికెట్ కొనుగోలును కలెక్టర్ స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఆర్టీసీ బస్టాండ్‌ను స్వచ్ఛతకు చిరునామాగా మార్చాలన్నారు. ఇందుకోసం మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించాలన్నారు. భద్రత విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆర్టీసీ సముదాయంలోని హోటళ్ల దుకాణాల వద్ద చెత్త చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బస్టాండ్ నుంచి సర్వీసులు బయలుదేరు వేళల వివరాలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీపీటీఓ మధుసూదన్, డీఎం ఇనయతుల్లా, ఏఓ ఉషారాణి, అసిస్టెంట్ మేనేజర్ హరితతో పాటు సిబ్బంది ఉన్నారు.

యోగాపై అవగాహన పెంపొందించుకోవాలి

ప్రశాంతి నిలయం: ప్రతి ఒక్కరూ వయసుతో పని లేకుండా యోగాసనాలపై అవగాహన పెంపొందించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణలో భాగంగా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలసి ఆర్డీఓలు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ ప్రతి మనిషి తమ దైనందిన జీవితంలో యోగాకు అత్యధిక ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా డివిజన్ స్థాయిలో జరిగే కార్యక్రమాలకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. సచివాలయ సిబ్బంది సేవలను వినియోగించుకొని ఇంటింటికీ వెళ్లి యోగాపై అవగాహన కల్పించాలన్నారు. యోగా డే సందర్భంగా జూన్ 21న జిల్లాలో యోగా కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, స్పెషల్ ఆఫీసర్లు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పుట్టపర్తిలో ఆ నెల 28న, కదిరిలో జూన్ 4, ధర్మవరంలో జూన్ 10, పెనుకొండలో జూన్ 17న యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, దానికి సంబంధించి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

● సీఐ, ఎస్ఐలే కారణమంటున్న బాధితురాలు



ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న యశిక

అనంతపురం మెడికల్/కదిరి అర్బన్: కదిరి పట్టణానికి చెందిన యషిక సూపర్ వాస్మోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆమెను మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చేర్పించారు. యషిక, ఆమె తండ్రి లక్ష్మీనారాయణ వివరాల మేరకు.. కదిరికి చెందిన లక్ష్మీనారాయణ, శిరీష దంపతుల మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో శిరీషకు సంబంధించి ఫొటోలను మార్ఫింగ్ చేశారన్న ఆరోపణలపై యషిక, ఆమె తండ్రి లక్ష్మీనారాయణ తదితరులను పోలీసుస్టేషన్‌కు రావాలని పిలుపుస్తున్నారు. ఇదే క్రమంలో శుక్రవారం యషికకు సీఐ నారాయణరెడ్డి ఫోన్ చేసి దుర్భాషలాడడంతో ఆమె స్టేషన్‌కు వెళ్లింది. అక్కడ సీఐతో పాటు ఎస్ఐ బాబ్జాన్ నానా మాటలు అనడంతో మనస్థాపంతో యషిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. టీడీపీ నాయకుల ఒత్తిళ్లతోనే పోలీసులు తమను వేధిస్తున్నారని, శిరీషతో ఇప్పటికే విడాకులకు దరఖాస్తు చేసుకున్నట్లు లక్ష్మీనారాయణ తెలిపారు. ఇదిలా ఉండగా.. తాను తన మిత్రుడితో కలసి ఉన్న ఫొటోలను మార్ఫింగ్ చేశారని శిరీష కదిరి పట్టణ పోలీసులను ఆశ్రయించింది. రూ. 3 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో పాటు అసభ్యకరంగా మాట్లాడారని ఆరోపించింది. శిరీష ఫిర్యాదు మేరకు ఆమె భర్త లక్ష్మీనారాయణ, కుమార్తె యషిక, ఆమె భర్త శివ, జగదీష్ అనే వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులోకి దూకి మహిళ ఆత్మహత్య



మృతురాలు లలిత

ధర్మవరం రూరల్: ధర్మవరం పట్టణంలోని శివానగర్‌కు చెందిన ఉడతనపల్లి లలిత (56) అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జీవితంపై విరక్తితో శుక్రవారం ధర్మవరం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. వన్ టౌన్ సీఐ పి. నాగేంద్రప్రసాద్ వివరాల మేరకు .. మృతురాలు కొంత కాలంగా షుగర్ వ్యాధితో బాధపడుతుండేది. షుగర్ వ్యాధి వల్ల ఆమె కుడి కాలు ఇన్ఫెక్షన్ అయి కాలికి ఉన్న రెండు వేళ్లను తొలగించారు. నొప్పిని భరించలేక మనస్థాపంతో ఇంట్లో నుంచి వెళ్లి చెరువు కట్ట వద్ద ఉన్న శివాలయం సమీపంలో చెరువులోకి దూకి చనిపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉచిత ఆన్‌లైన్ సహకార కేంద్రం ఏర్పాటు

ధర్మవరం రూరల్: ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి ధర్మవరం పట్టణంలోని స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఉచిత సహకార కేంద్రం ఏర్పాటు చేసినట్లు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. ప్రభుత్వం మొదటిసారిగా ఉపాధ్యాయ బదిలీల చట్టాన్ని తీసుకొచ్చి బదిలీలు చేస్తోందని, బదిలీలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి, ఆన్‌లైన్‌లో అప్లికేషన్ నమోదుకు ఉపాధ్యాయులకు అవగాహన కల్పించడానికి యూటీఎఫ్ ధర్మవరం డివిజన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సహకార కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ సేవలు అన్ని ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రామకృష్ణనాయక్, లతాదేవి, రాష్ట్ర కౌన్సిలర్ ఎం.మేరీ వరకుమారి, ధర్మవరం డివిజన్ నాయకులు ఆంజనేయులు, లక్ష్మయ్య, అమర్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన కిడ్నాప్ కథ

తాడిపత్రిటౌన్: పట్టణంలో కేబుల్ ఆపరేటర్ యజమానుల మధ్య తలెత్తిన వివాదం నేపథ్యంలో గురువారం వైఎస్సార్‌సీపీ కార్యకర్త యాసిన్‌ను కొందరు టీడీపీ నాయకులు కిడ్నాప్ చేసిన సంగతి తెలిసిందే. అయితే శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డితో పాటు యాసిన్ తాడిపత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని తనను టీడీపీ నాయకులు ధనుంజయరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, రామాంజులరెడ్డి, బేల్దారి ప్రసాద్ కిడ్నాప్ చేసి రూములో బంధించి ఇనుప పైపులు, కట్టెలతో చావబాదారని, గురువారం రాత్రి సమయంలో వదిలేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటికి చేరుకొన్న తనకు తీవ్ర జ్వరం రావడంతో కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఉదయం ఆస్పత్రిలో చికిత్స తీసుకొని వచ్చానని పేర్కొన్నారు. డిష్ గొడవలు ఉంటే యజమాన్యాలు చూసుకోవాలి కాని అందులో పనిచేసే తమకు ఏం సంబంధం ఉంటుందని యాషిన్ పోలీసుల ముందు వాపోయారు.